ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 21 | సంచిక : 2 | అక్టోబర్ 2015

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


08-07-2015
జిన్నూరు
23-07-2015
అప్పనపల్లి



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-07-2015 జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రపంచంలో ఉన్న గొప్పగ్రంథాలలో బైబిల్, భగవద్గీత, దమ్మపదం, ఖురాన్ ఇవి నాలుగు ప్రత్యేక గ్రంథాలు. కనుమూసి చూతువు, కనుతెరిచి చూపెదవు ఓ అద్వైతశేఖరుడా, ఓరమణా అంటే నువ్వు కళ్ళుమూసుకొంటే నీ హృదయంలో ఏముందో అది నువ్వు చూసుకొంటావు. నీ హృదయంలో ఏముందో అదే మా హృదయంలోకూడా ఉంది. కాని అది నువ్వు చూడగలుగుతున్నావు మేము చూడలేకపోతున్నాము. నువ్వు కళ్ళుతెరచి మా హృదయంలో ఉన్న దానిని మాకు చూపిస్తున్నావు. శంకరుడు, రమణుడు అద్వైతం చెపుతారు. వారు ఎక్కడా రాజీపడరు. ఎక్కడా ఏమీ జరగడంలేదు అంటారు అంటే ప్యూర్ అద్వైతం చెపుతారు. రామకృష్ణుడు అద్వైతం చెప్పినా అందులో విశిష్టాద్వైతాన్ని, ద్వైతాన్ని కలుపుతాడు అంటే యివన్నీ సమన్వయం చేసి చెపుతాడు. అద్వైతాన్ని భక్తిగా చెపుతాడు, వాడు రామకృష్ణుడు. గురువులు అనేకరకాలుగా చెపుతారు. అందరి టీచింగ్ మనకు అవసరమే. ఎవరనీ కాదనటానికి వీలులేదు. మన మెంటల్ మేకప్‌నుబట్టి ఒక్కొక్కరికి ఒక్కోటి యిష్టమవుతుంది.

అచ్యుత, అనంత, గోవింద తిరుపతి వెళ్ళినవారు వేంకటేశ్వర

స్వామిని దర్శనం చేసుకొనేటప్పుడు అందరూ గోవిందా, గోవిందా అంటారు. ఎందుచేతనంటే కృష్ణుడు నిర్యాణం అయ్యాక తిరుపతిలో భక్తులకుదర్శనం యివ్వటం కోసం శిలారూపం ధరించాడు అని పురాణాలు చెపుతున్నాయి. అంటే అక్కడ శిలారూపంలో ఉన్నవాడు గోవిందుడే అనే ఉద్దేశ్యం మీద వేంకటేశ్వరస్వామిని అక్కడ అందరూ గోవిందా, గోవిందా, గోవిందా అనే అంటారు. సూరదాసుకు కళ్ళులేవు. సూరదాసు గోవిందుడి మీద పదివేల పాటలు వ్రాసాడు. బాపూజీ భార్య చనిపోయేరోజున, ఇంకో గంటకు చనిపోతుంది అనగా ఆవిడ సూరదాసు వ్రాసిన పాట పాడింది. దాని అర్థం ఏమిటి అంటే నా శరీరాన్ని విడిచిపెట్టే టైమువచ్చింది, శరీరం ముసలిది అయిపోయింది. వయస్సు వచ్చేకొలది శరీరం ముసలిది అవుతుంది కాని కోరికలు ముసలివి అవ్వవు. అంటే కోరికలకు ముసలితనం రాదు, అవి ఇంకా గట్టిపడతాయి. కాయ పండుఅయినా లోపల గింజలు గట్టిగా ఉంటాయి. ఈ శరీరం చనిపోయినా కోరికలు అలాగే ఉంటాయి. అవి ఇంకో శరీరంకోసం వెతుక్కొంటాయి. నెరవేరని కోరికలు మనలో చాలా ఉంటాయి, అవి ఏ శరీరం వస్తే బావుంటుందో అని వెతుక్కొంటూ ఉంటాయి. కాని నిన్ను కోరుకొనేది ఏమిటి అంటే గోవిందా మరలా ఇటువంటి శరీరాలు రాకుండా, యిటువంటి శరీరమే కాదు ఏ శరీరమూ రాకుండా చూడు అని ప్రార్థిస్తున్నాను. నాకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే నువ్వు యిస్తావు కాని నేను ప్రార్థించినంతమాత్రంచేత నువ్వు యిస్తావని నేను అనుకోవటంలేదు. అందుచేత ఇంక శరీరం రాకూడదు అని నేను కోరుకొంటున్నాను కాని తీర్పు చెప్పేవాడివి నువ్వు మాత్రమే గోవిందా. శరీరాలులేని స్థితి నాకు యింకా రాలేదేమో, చివరిస్థితిని నేను ఇంకా పొంది ఉండను. నేను మానసికంగా పక్వానికి రాకుండా, నా బుద్ధి ఇంకా ముగ్గకుండా జన్మలేని స్థితిని ఇమ్మని అడిగినా అది సాధ్యంకాకపోవచ్చు. యింక శరీరాలు నాకు ఇష్టంలేదు అందుచేత నీలో ఐక్యం చేసుకోమని అడుగుతున్నాను గోవిందా. నేను అడిగితే మాత్రం ఐక్యం చేసుకొంటావా? నా యోగ్యత కూడా చూస్తావుకదా. అహంకారం ఈ ప్రపంచంలో ఏదో ఆధారాలను పట్టుకొని వేలాడుతూ ఉంటుంది. శరీరం చనిపోయేటప్పుడు కూడా

ఏదో రూపాన్ని పట్టుకొని పోతుంది. అది ఎవరో ఒకరిని పట్టుకోవటం మానదు. అందుచేత నీ రూపాన్నిపట్టుకొనేలా చేయమని అడుగుతున్నాను. నేను అడిగితే మటుకు చేస్తావా. ఆ పాటపాడిన ఒకగంట తరువాత కస్తూరీబాయి చనిపోయింది. ఇప్పుడు మనకు రాజ్యాంగం ఎలాఉందో అలాగే భగవంతుడికి రాజ్యాంగం ఉంటుంది. ఆ రాజ్యాంగాన్ని అనుసరించి జీవులను నడుపుతూ ఉంటాడు. గజేంద్రమోక్షంలో గజేంద్రుడిని రక్షించినట్లుగా డివైన్ యింటర్‌ఫియరెన్స్ ఎప్పుడయినా రావచ్చు. అది కామన్‌గా వస్తుందని మనం చెప్పకూడదు.

నువ్వు ఏరకంగా జీవిస్తే నీలో అంతర్యామిగా ఉన్న పురుషోత్తముడిని పొందగలవో 15వ అధ్యాయం పురుషోత్తమప్రాప్తియోగంలో పరమాత్మచెప్పాడు.

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః**

**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.**

నేను జఠరాగ్ని రూపములో ప్రాణుల శరీరంలో ఉండి, వారు తిను ఆహారమును జీర్ణమొనరించువాడిని నేనే అని పరమాత్మ చెపుతున్నాడు. మీరు ఏది తిన్నా అరగాలంటే జఠరాగ్ని ఉండాలి. ఆ జఠరాగ్ని రూపంలో ఉన్నవాడిని నేను అని అంటున్నాడు. ప్రాణవాయువు, అపానవాయువులతో కలిసి మీరు తిన్న ఆహారాన్ని జీర్ణంచేసి మీ శరీరానికి శక్తిని కలుగజేస్తున్నాడు. అంటే జఠరాగ్నిరూపంలో ఉన్నవాడు ఆయనే, మీకు శక్తిని యిచ్చేవాడు ఆయనే, అంతా ఆయనే. మీకు ఐశ్వర్యం ఉన్నా, తెలివిఉన్నా, మీకు ఏరకమైన విభూతి ఉన్నా యివన్నీ కూడా భగవంతుడు యిచ్చిన ప్రసాదమే కాని మనసొంతం ఏమీలేదు. అది గుర్తించినవాడు ధన్యుడు, వారికి భగవంతుడి ఆశీస్సులు అంటాయి. గొడ్డలిపెట్టి చెట్టును నరికినట్లుగా మీకు ఉన్న బలహీనతలను మీకు ఉన్న చెడు అలవాట్లను మీరు నరకలేకపోతే వెయ్యిజన్మలు ఎత్తినా మీకు ముక్తిలేదు, మీరు బంధంలోనుండి బయటకురాలేరు. మీరు ఎన్ని ప్రయత్నాలు చేసినా వైరాగ్యం లేకుండా జ్ఞానం కలుగదు.

**మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ**

**నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః**

మనస్సుకోతిలాంటిది. కోతి ఒక రొబ్బమీదనుండి ఇంకో రొబ్బమీదకు అలా ఉరుకుతూ ఉంటుంది. ఒక రొబ్బమీద స్థిరంగా కూర్చోదు. అలాగే మన మనస్సుకూడా చంచలముగా ఉంటుంది. మనస్సు స్థిరంగా ఉండదు. గాలిని మూటకట్టవచ్చును కాని మనస్సును నిగ్రహించటం కష్టం అని చెపుతారు. మనస్సును నాయందే స్థిరముగా నిలబెట్టి ఉంచండి. దానిని వదలివేయకండి. వదిలేస్తే దానికి చపలత్వం ఎక్కువ అవుతుంది. నువ్వు ఏ పని చేస్తున్నా నన్నే స్మరిస్తూ ఉండాలి, నీ హృదయంలో నాకు ఒక్కడికే చోటు యివ్వాలి. నన్నే స్మరించుకోండి, నన్ను తలపెట్టుకోండి అని భగవంతుడు అడుగుతున్నాడు. అంటే మనలను బాగుచేయటానికి ఆయన అడుగుతున్నాడు. మనస్సు ఆలోచిస్తుంది, బుద్ధి నిర్ణయిస్తుంది. అందుచేత మనస్సును, బుద్ధిని రెండింటిని భగవంతుడి మీదే నిలబెట్టి ఉంచు. నీ మనస్సును, బుద్ధిని నాయందే పెట్టి నా నామాన్ని స్మరించుకొంటూ, నా రూపాన్ని ఆరాధిస్తూ జీవస్తూ ఉంటే నువ్వు నాయందే నివసింతువు, ఇందులో సందేహంలేదు అని పరమాత్మ చెపుతున్నాడు.

ప్రతీమనిషికి ఆ శరీరాన్ని పోషించుకోవటానికి, సంసారాన్ని నడపటానికి ఎంతో కొంత ఆశ ఉంటుంది. అందరూ స్థితప్రజ్ఞులు కాదు, అందరూ జ్ఞానులు కాదు. ప్రతీమనిషికి ఎంతోకొంత ఆశ ఉంటుంది. ఆమాత్రం దానికి ఫరవాలేదు, దురాశ ప్రమాదం. దురాశవల్ల ముందు మతిపోతుంది, మతిపోయిన తరువాత గతిపోతుంది అన్నాడు బుద్ధుడు. గతి అంటే మోక్షం. దురాశవల్ల నువ్వు ఏదయితే పొందాలో దాని తాలూకు గమ్యంకూడా మర్చిపోతావు. అందుచేత మీరు ఏ విషయంలోను అతిగా ఉండవద్దు. అతి అవసరంలేదు. జనరల్‌గా మీకు ఏమీలోటు లేనప్పుడు మీరు తృప్తిపడాలి. మనిషి ఒక్క ఆహారంవల్లనే బతకలేడు. మనస్సుకు కొంత సంతృప్తి ఉండాలి అందుకే ఈ సత్సంగాలు. జీవితంలో మంచి స్నేహితులు దొరికితే మనిషి అభివృద్ధిలోనికి వస్తాడు. అందుచేత చేసే స్నేహాల విషయంలో, చదివే పుస్తకాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

రామకృష్ణుడు ఏమంటున్నాడు అంటే మీ ఇంటికి కొన్ని కుక్కలు అలవాటుగా వస్తూ ఉంటాయి. ఆ కుక్కలను మీయింటికి రాకుండా చెయ్యాలన్నా అవి రావటం మానవు. అవి

మీ యింటికి వచ్చినప్పుడల్లా మాంసపుముక్కలు పెడుతూ ఉంటే అవి ఎలాపోతాయి. వాటిని రాకుండా చెయ్యాలంటే అవి వచ్చినప్పుడు వాటికి తిండిపెట్టకుండా బయటకు కొట్టేస్తూ ఉంటే అవి పోతాయి. నాకు ఉన్న అలవాట్లు, కోరికలు, వాసనలు ఇవి అన్నీ కుక్కల్లాంటివి. మీ ఇంటికి వచ్చిన కుక్కలు అంత తేలికగా విడిచిపెడతాయా. ఒకవేళ మీరు గెంటేసినా మరుసటిరోజున వచ్చేస్తుంది. వాటికి మాంసపుముక్కలు పెడుతూ ఉంటే అవి రావటం మానతాయా? అలాగే మీకు ఉన్న కోరికలను నెరవేర్చుకొంటూ నువ్వు పో, నువ్వు పో, నేను ధ్యానం చేసుకొంటున్నాను అంటే అవి పోతాయా. అవి కుక్కలువయ్యా అంటున్నాడు రామకృష్ణుడు. మీకు వచ్చిన కోరికలను సంతృప్తి పరస్తూ ఉంటే అవి ఎలాపోతాయి, అలా వస్తూనేఉంటాయి. కోరికలను శాటిస్‌ఫై చేసేకొలదీ అవి పెరిగిపోతాయి. శాటిస్‌ఫై చెయ్యకపోతే అవి నెమ్మదిగా తగ్గిపోతాయి. మీకు వచ్చిన కోరికలను సంతృప్తి పరచినదాని కంటే, వాటిని సంతృప్తి పరచకుండా బయటకు తోలేస్తే భవిష్యత్‌లో మీకు ఎక్కువ శాంతి, సుఖం అనుభవంలోనికి వస్తుంది. మీకు ఏదయినా కోరిక వచ్చినప్పుడు దానిని సంతృప్తి పరచకుండా అలా ఉండండి. దానిని సంతృప్తిపరచిన దానికంటే, సంతృప్తిపరచకుండా వదిలేస్తే అది ఎక్కువ సుఖాన్ని, శాంతిని తీసుకొనిరావటమే కాకుండా నీకు భవిష్యత్‌ను చూసే వివేకాన్ని కూడా ప్రసాదిస్తుంది. జరిగిపోయింది ఏదో జరిగిపోయింది. యిప్పుడు బాధపడితే ఏమి లాభం. జరిగిపోయిన గొడవలు వద్దు. కుక్కలతోటి మీరు చేసిన సహవాసాలు సరిపోతాయి. భవిష్యత్‌లో వాటితో సహవాసం మానేయండి. అవసరమయితే ఒక దెబ్బ కొట్టి వాటిని గెంటేయండి. కాలక్రమంలో అవి ఇంక రావు. మీరు అభ్యాసం చెయ్యగా, చెయ్యగా మనస్సు మీకు స్వాధీనమవుతుంది. ఒకవేళ నీవు అభ్యాసం చెయ్యలేకపోతే, ధ్యానం చెయ్యలేకపోతే నాకు సంతోషం కలిగించే పనులు చెయ్యి అంటున్నాడు పరమాత్మ.

మీ భక్తులు హాలులో కూర్చొని బాగా ధ్యానం చేసుకొంటున్నారు. అలా నాకు కూడా చేసుకోవాలని ఉంది. కాని నాకు చేతనవటంలేదు అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగాడు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే వాళ్ళు కళ్ళుమూసుకున్నమాట నిజమే. వాళ్ళు దేవునిధ్యానం

చేస్తున్నారో, దెయ్యాలను ధ్యానం చేస్తున్నారో మనకేమి తెలుస్తుంది. ఏమో ఒకవేళ కోరికలను ధ్యానం చేస్తున్నారేమో ఎవరికి తెలుసు. వాళ్ళు బాగా ధ్యానంచేస్తున్నారు అంటున్నావు. ఆ ధ్యానాల గొడవ నీకు ఎందుకు. ఈ శరీరం నువ్వు కాదు, మనస్సువు నువ్వు కాదు. లోపల నువ్వు ఏదిగా ఉన్నావో దానిని జ్ఞాపకం పెట్టుకో. సత్యం నీ హృదయంలో ఉంది. దానిని ఒక్కటే జ్ఞాపకం పెట్టుకో. ఈ జపాలు, ధ్యానాలు, కళ్ళు మూసుకోవటాలు వాటి గొడవ నీకు ఎందుకువయ్యా. ఈ శరీరం వచ్చింది అంటే అది పోతుంది. దానిని ఎంత నిలబెడదామన్నా అది చనిపోతుంది. ఆ శరీరానికి మంచి ప్రారబ్దం ఉండవచ్చు, చెడుప్రారబ్దం ఉండవచ్చు. ఆ ప్రారబ్దం ఖర్చు అయ్యేవరకు శరీరం ఉంటుంది. చెడుప్రారబ్దం అయినా మీరు దానిని సంతోషంగా అనుభవిస్తే వచ్చేజన్మలో అది మీకు రాదు అని శాస్త్రంలో చెప్పాడు. ఆ ప్రారబ్దాన్ని అనుభవించకుండా మనం తొందరపడినా శరీరం మరణించదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. కళ్ళుమూసుకోవటం, కళ్ళుతెరవటంతో దానికి సంబంధంలేదు. అది స్వతంత్రమైనది. కాబట్టి నీవు దానిని జ్ఞాపకం పెట్టుకో సరిపోతుంది. వాళ్ళు కళ్ళు మూసుకొన్నారని నీవు కళ్ళుమూసుకోనక్కరలేదు. నీ హృదయంలో ఉన్న నిజాన్ని నువ్వు గుర్తుపెట్టుకొంటే ఇంక నీకు ఈ జపాలు, ధ్యానాల గొడవ దేనికి. ఎందుకువయ్యా ఈ అల్లరి అంతా నీకు, నీ హృదయంలో ఉన్న నిజాన్ని గుర్తు పెట్టుకో సరిపోతుంది అన్నారు.

మీరు పెద్దపెద్ద సాధనలు చెయ్యలేకపోవచ్చు . అభ్యాసంచెయ్యటం, ధ్యానంచెయ్యటం, విచారణచెయ్యటం నీకు కష్టంగా ఉంటే నాకు సంతోషం కలిగించే కర్మలు చెయ్యి. నీ యిష్టాలు అన్నీ ఒకప్రక్కన పెట్టి ఏరకంగా నువ్వు పనిచేస్తే నాకు సంతోషం కలుగుతుందో, నాకు ప్రీతి కలుగుతుందో ఆ రకంగా పనిచెయ్యి. నేను మెచ్చే పనులు, నాకు యిష్టమైన పనులు మంచిపనులు చేస్తూ ఉండు. మానవజాతిరూపంలో ఉన్నవాడు అంతా ఈశ్వరుడే. భగవాన్ స్కంధాశ్రమంలో ఉండగా ఒక హరిజన స్త్రీ నాకు దాహంగా ఉంది, మంచినీళ్ళు పోయండి అని అడిగింది. అళగమ్మ ఏమనుకొంటోంది అంటే మనం బ్రాహ్మణులం, వాళ్ళు హరిజనులు. మనం వాళ్ళకు నీళ్ళుపోస్తే మడి పోతుందేమో అని ఆలోచిస్తోంది. అప్పుడు

భగవాన్ ఏమన్నారు అంటే ఆవిడ హరిజన స్త్రీ అని నువ్వు అనుకొంటున్నావు, ఆవిడ హరిజనుడుకాదు, ఆ రూపంలో ఉన్నవాడు అరుణాచలేశ్వరుడే. అరుణాచలేశ్వరుడే ఆరూపంలో వచ్చి నిన్ను మంచినీళ్ళు అడుగుతూ ఉంటే నువ్వు యివ్వటం లేదు. మరి ఆశ్రమానికి వచ్చి ఏమి నేర్చుకున్నావు. యిటువంటి పద్ధతులు విడిచిపెట్టలేకపోతే నువ్వు యింటికి వెళ్ళిపోవచ్చు కదా అని భగవాన్ కోపం చేసుకొన్నారు. ఎందుచేతనంటే అలా కోపం చేసుకోకపోతే ఆవిడలో ఉన్న ఆ వాసన నశించదు. మీరు పెద్దపెద్ద సాధనలు, అభ్యాసాలు చేయలేకపోతే మీరు ఏపని చేస్తే నాకు సంతోషం కలుగుతుందో ఆపనిని సైలెంట్‌గా చెయ్యండి. అలా పనిచెయ్యటంవలన నా అనుగ్రహం మీ శిరస్సుమీద కురుస్తుంది. మీరు ఒక మనిషికి దాహం యిస్తే ఆ మనిషి రూపం మీకు అక్కరలేదు. ఆ మనిషి లోపల పరమేశ్వరుడే ఉన్నాడు, మీరు యిచ్చిన మజ్జిగ తాగేది పరమేశ్వరుడే. మీరు ఎవరికయినా రెండు సెంట్ల స్థలం యిస్తే అక్కడ ఎంజాయ్ చేసేది పరమేశ్వరుడే, ఆ రూపంలో ఉన్నవాడు ఆయనే. ఇది మీరు గుర్తుపెట్టుకోండి.

మీరు ఏదయినా ఒక మంచిపని చేస్తే అది అందరికి తెలిసిపోవాలని అనుకొంటారు. నువ్వు చేసే పని అది మంచిపని అయినా అది ఇతరులకు తెలియాలి అనుకొంటే ఇంక నీకు జ్ఞానం రాదు, దానివలన నీలో అజ్ఞానం పెరుగుతుంది. అవిద్య పెరుగుతుంది. బంధాలు పెరుగుతాయి. నువ్వు చేసేది చూడటానికి అది మంచిపని అయినా నువ్వు లోపల కుళ్ళిపోతావు అన్నాడు యేసు. నాకు ఇంకా జ్ఞానంరాలేదు, జ్ఞానంరాలేదు అంటాము. భగవంతుని అనుగ్రహం కనుక మనకు ఉంటే జ్ఞానం వచ్చేస్తుంది. నాకు ప్రీతికలిగించే పనులు కనుక మీరు చేస్తే నా అనుగ్రహం మీకు కలుగుతుంది అని పరమాత్మ చెపుతున్నాడు. భగవంతుడు ఏ జీవుడినయితే ఎన్నుకొన్నాడో వాడికి మాత్రమే జ్ఞానం ఇస్తాడు అని ఒక ఉపనిషత్‌లో చెప్పాడు. మీరు అందరూ ఏవో పనులు చేస్తున్నారు. అవి ఎందుకు చేస్తున్నారు. ఎలా చేస్తున్నారు, ఎవరికోసం చేస్తున్నారు. పబ్లిసిటీకోసం మీరు ఆపనులు చేస్తున్నారా, ఓట్లకోసం చేస్తున్నారా, పదిమందికి తెలియాలి అని చేస్తున్నారా, మీ పేర్లు గోడమీద రాసుకోవడానికి చేస్తున్నారా లేకపోతే అంతర్యామిగా ఉన్న పరమాత్మ సంతోషించటానికి

చేస్తున్నారా? భగవంతుడు కళ్ళులేకుండా చూడగలడు, చెవులు లేకుండా వినగలడు, కాళ్ళు లేకుండా నడవగలడు, చేతులులేకుండా పనిచేయగలడు, భగవంతుడు చూడకుండా మీరు ఏపనీ చేయలేరు. ఈ అరటిపండు ఎవరికి కనబడకుండా రహస్యంగా తిన్నాము అని మీరు అనుకొంటారు. మీరు ఎంత రహస్యంగా తిన్నా, ఆ రహస్యమయిన ప్రదేశంలోకూడా దేవుడు ఉన్నాడు కాబట్టి మీరు తిన్న అరటిపండును ఆయన చూస్తాడు. మనకు కళ్ళు లేకపోతే చూడలేము. భగవంతుడికి మనలాగ అవయవాలతో పనిలేదు. నువ్వు నాకోసం సత్కర్మను నిష్కామంగా కనుక చేస్తూఉంటే మోక్షాన్ని పొందుతావు. అంటే కర్మను యోగంగా చేసినా మోక్షాన్ని పొందుతావు. నువ్వు ఆసక్తిలేకుండా పనిచెయ్యి. మీరు మంచి పనులు చెయ్యండి. దాని ఫలితం ఎప్పుడు యివ్వాలి, ఎక్కడ యివ్వాలి, ఎలా యివ్వాలి అనేది భగవంతుడు నిర్ణయిస్తాడు. నువ్వు పని చెయ్యటానికే పనికివస్తావు. ఫలితం నీ చేతిలో లేదు, ఫలితం నా చేతిలో ఉంది. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యటం మానేసి నాచేతిలో ఉన్న పనిగురించి ఆలోచిస్తావు ఏమిటి? నాకు నువ్వు జ్ఞాపకం చేయనక్కరలేదు. అది ఎప్పుడు చెయ్యాలో నేను చేస్తాను అంటున్నాడు పరమాత్మ. సత్కర్మను నిష్కామంగా చేస్తూ ఉంటే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. ప్రపంచంలో ఏ మతానికి చెందినవాడు అయినా, ఏ కులానికి చెందినవాడు అయినా చిత్తశుద్ధి లేకుండా ఎవడికీ జ్ఞానంరాదు. చిత్తశుద్ధి చాలా ముఖ్యం. అంటే మీరు చేసే పనివలన మీకు చిత్తశుద్ధి కలగాలి, అది ముఖ్యం.

మనస్సును పవిత్రం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి, అదే మీ జీవితలక్ష్యం అన్నాడు బుద్ధుడు. ధనం వాసన ఉన్నవాడు ఏపని చేస్తే మనకు ధనం పెరుగుతుంది అని అదే ఆలోచిస్తూ ఉంటాడు అలాగే నువ్వు ఎలా ప్రవర్తిస్తే మనస్సుకు పవిత్రత పెరుగుతుందో చూసుకో. నీ మనస్సును పవిత్రం చేసుకోవడమే నువ్వు చేయవలసినపని. నీమాట, నీచేత, నీప్రవర్తన అన్నీకూడా నీ మనస్సు పవిత్రం అవ్వటానికి సహకరించాలి. సజ్జనసాంగత్యం వల్ల కూడా అది సాధ్యమే. సజ్జనసాంగత్యంవలన వారి వైబ్రేషన్స్, వారిలో ఉన్న మంచి తలంపులు మనమీద పనిచేస్తాయి. సజ్జనసాంగత్యం వలన మీకుఅన్నీ ప్రసాదించబడతాయి. హెూలీ

కంపెనీ చాలాముఖ్యం. మీ మనస్సు పవిత్రం అవ్వాలి. అదే గమ్యంగా పెట్టుకోండి. నువ్వు ఎవరికో ఏదో యిచ్చాను అంటావు. అయితేఅది నీకు ఎవరు యిచ్చారు. ఐశ్వర్యం అంతా ఈశ్వరుడిదే. ఒకవేళ మీరు ఏదయినా మంచిపనిచేసినా అది యితరులకు చెపితే దాని ఫలితం అంతా పోతుంది. నీ హృదయంలోనే స్వర్గం ఉంది. బయట ఉన్న రకరకాల మనుషులతో సహవాసాలు చేసి ఈ పాడుస్నేహాలవల్ల, పాడుఅలవాట్లవల్ల బయటఉన్న ఆకర్షణలకు లొంగిపోయి, ప్రకృతిగుణాలకు లొంగిపోయి నీ హృదయంలో ఉన్న స్వర్గాన్ని, అలౌకిక శాంతిని నీ చేతులతో నువ్వే పోగొట్టుకొంటున్నావు అన్నాడు మిల్టన్. స్వర్గరాజ్యం నీ హృదయంలోనే ఉంది. దానిని నువ్వే పాడుచేసుకొంటున్నావు. ఉన్నదానిని నువ్వే పాడుచేసుకొని మరల సాధనలు, సాధనలు అని చెపుతున్నావు. మనమీద ప్రేమకొలది, కేవలం మన శ్రేయస్సుకోరి ఇది అంతా చెపుతున్నాడు అంతే కాని ఏదో గౌరవంకోసంకాదు.

మన కోరికలే మనకు మళ్ళీ శరీరాలను తయారుచేస్తాయి. నెరవేరని కోరికలే మరల శరీరాలను ధరిస్తాయి. కోరికలు శేషంలేకుండాపోతే ఇంక వాడికి శరీరం అవసరం లేదు. మీకు ఏ కోరికలు లేవు అనుకోండి. యిహానికి సంబంధించిన భోగాలమీద కాని, పరానికి సంబంధించిన భోగాలమీదకాని ఎక్కడా మీ మనస్సు లేదు అనుకోండి. ఇంక మీరు శరీరాన్ని ఏమి చేసుకొంటారు. అందుచేత మీకు శరీరం రాదు. లోపల ఏరకమైన వాంఛలు మిగిలిపోయి ఉన్నా శరీరాలు వచ్చేస్తాయి. చివరకు స్త్రీ, పురుష బేధం ఉన్నా శరీరం వచ్చేస్తుంది. ఐ హేవ్ నెవ్వర్ ఎంజాయ్డ్ ది వరల్డ్, ఈవెన్ యిన్ ఎ డ్రీమ్ అంటాడు రామకృష్ణుడు. ఇంక ఆయనకు శరీరం ఏమిటి, ఆయనకు శరీరంతో పని ఏముంది. ఈ సృష్టిలో ప్రతీదీ ఈశ్వరసంకల్పం ప్రకారం నడుస్తోంది. ఇది మనం పుస్తకాలలో చదువుతున్నాము కాని హృదయంలో మనకు అనుభవంలోనికి రావటంలేదు. అందుచేత మనలను దుఃఖం వెంటాడుతోంది. అంతా ఈశ్వరసంకల్పంతో నడుస్తోంది అన్నవిషయం నీకు అనుభవంలోనికి వస్తే నీవు జీవన్ముక్తుడవు అవుతావు. భగవంతుడు మిమ్మల్ని పనిముట్లుగా ఉపయోగించుకొని మిమ్మల్ని తరింపచేసే బాధ్యత ఆయన తీసుకొంటాడు.

మీరు కనుక శరణాగతి చేస్తే ఇంక మిమ్మల్ని తరింపచేసే పని ఆయనదే. అది అలా ఎందుకు జరిగింది, యిది యిలా ఎందుకు జరిగింది అని శరణాగతి చేసినవాడు అడగడు. శరణాగతి చేసినవాడికి నేను ఎక్కడ ఉంది. భగవంతుడి యిష్టమే నా యిష్టం, భగవంతుడి సంకల్పమే నా సంకల్పం అంటాడు. మాకు మోక్షసుఖం కావాలి, మోక్షసుఖం కావాలి అంటున్నారు, అసలు వస్తే మీరు భరించగలరా. మీకు బజారుసుఖాలు తెలుసు కాని మోక్షసుఖం ఎలా ఉంటుందో మీకు తెలియదు. కుళాయినుండి నీరువస్తూ ఉంటే మనం భరించగలముగాని ఏటిగట్లు తెగిపోయి వరద ప్రవాహం కింద వస్తూ ఉంటే మనం దానిని తట్టుకోగలమా. మోక్షసుఖం మాకు అందటంలేదు అంటున్నారు. నిజంగా భగవంతుడు మీకు యిస్తే ఆ సుఖం యొక్క వేగాన్ని, ఆ ప్రవాహాన్ని మీరు భరించలేరు, మీకు ఊపిరి ఆడక చనిపోతారు. యిదే భగవాన్ చెప్పారు. ఒక పెద్ద ఏనుగును చిన్న గుడిసెలోనికి పంపితే ఆ గుడిసె ఎలా పడిపోతుందో అలాగే మోక్షసుఖం వచ్చినప్పుడు ఆ ప్రవాహవేగాన్ని తట్టుకోలేక మీ శరీరాలుకూడా పడిపోవచ్చు అన్నారు. మాకు మోక్షం కావాలి, మాకు మోక్షం కావాలి అని భగవాన్‌ను కొంతమంది చాదస్తంగా అడిగేవారు. నన్ను మోక్షం యిమ్మని అడుగుతున్నావు. యిప్పుడే నీకు మోక్షం యిస్తాను. నువ్వు తీసుకోగలవా, తీసుకోవటానికి నువ్వు డిజర్వు అయి ఉన్నావా? తీసుకొనే శక్తి నీకు ఉందా చూసుకో. నువ్వు డిజర్వు కానిది భగవంతుడు నీకు యివ్వడు ఎందుచేతనంటే నువ్వు దానిని భరించలేవు.

నువ్వు ఈశర్వుడికి భిన్నంగా ఉన్నావా? మీరు అప్పడే పెద్దవారు అయిపోయారా? మీరు స్వతంత్రులు అయిపోయారా? అసలు మనం ఈశర్వడి సంకల్పాన్ని గౌరవిస్తున్నామా. ఈశ్వరుడిని కాదని మీరు చేసేది ఏమిటి. ఎవరయినా మాట అంటే మనం పడగలమా? మనకు అసలు సహనం ఉందా? ఎక్కడయితే గొయ్యి ఉందో అక్కడకు నీరు చేరుతుంది అలాగే మీకు ఎంతోకొంత సహనం ఉంటేనే మీకు అక్కడ జ్ఞానం చేరుతుంది, సహనం లేకపోతే మీకు జ్ఞానం కలుగదు. అసలు కొంచెం కూడా సహనం లేనివాడికి ఆత్మజ్ఞానం ఏమిటి? నేను అలా చేసాను, నేను ఇలా చేసాను అని అస్తమాను నేను, నేను అంటాము.

మీరు చెప్పే నేను అసలు లేడు. భగవంతుడే మీ శరీరాన్ని ఉపయోగించుకొని ఆపని చేసాడు. కాని ప్రతీదానికి నేను చేసాను, నేను చేసాను అంటున్నారు. ఆ నేను యొక్క వాడకం తగ్గించేయండి అని భగవంతుడు చెపుతున్నాడు. పైగా మనదగ్గర ఇంకో పాడుబుద్ధి ఉంది. ఎవరో చేసిందికూడా మనమే చేసాము అంటాము. మీ బ్రెయిన్స్ అలా ఉండకూడదు అంటున్నాడు రామకృష్ణుడు. నేను యొక్క వాడకం తగ్గించుకో. ఈశ్వరుడే నీ శరీరాన్ని ఉపయోగించుకొంటున్నాడు. ఏదైనా నీ ద్వారా మంచిపనిజరిగినా, నువ్వు ఎవడవు చేయటానికి. ఈశ్వరుడే నీ శరీరాన్ని ఉపయోగించుకొని ఆపని చేసాడు. అర్జునుడు గొప్ప యుద్ధాలు చేసాడు. ఆ యుద్ధాలు అన్నీ ఎవరు చేసారు అంటే అర్జునుడికి తన శక్తిని యిచ్చి గోవిందుడే చేయించాడు. మనిషికి ఎవడికీ శక్తిలేదు, శక్తి అంతా గోవిందుడిదే. అది మనం గ్రహించాలి. భీష్ముడు, ద్రోణుడు వాళ్ళందరూ పెద్ద పెద్ద వీరులు. వీరిని ఎలా చంపగలను అని నీ మనస్సులో ఒక తలంపు ఉంది. నువ్వు ఎవరినైతే చంపుదామని అనుకొంటున్నావో వారిని నేను ముందుగా చంపేసి ఉంచాను. నేను ఎవరినయితే చంపి ఉంచానో వారినే నువ్వు చంపటం. నువ్వు వూరికే చేతులు ఆడించు. పని నాది గౌరవం నీది అంటున్నాడు పరమాత్మ. అలాగే మీ ద్వారా ఏదయినా మంచి జరిగినా మీ చేత భగవంతుడే ఆ పని చేయించాడు. ఆ గౌరవం భగవంతుడికి వెళ్ళాలి కాని, ఆపని నేను చేసాను అని మీరు గౌరవం ఆశిస్తే మరల మీరు మాయలో పడిపోతారు, జన్మలు పెరిగిపోతాయి. అర్జునుడు అంతటివాడినే నువ్వు నిమిత్త మాత్రం అంటే ఇంక మనం ఏపాటివారము. అర్జునుడు మహావీరుడు అని మనం అనుకొంటున్నాము. ఆ వీరత్వం ఎవడు ఇచ్చాడు అంటే గోవిందుడే. చేసిందంతా గోవిందుడే. అలాగే మీ ద్వారా ఏదయినా మంచిపనులు జరిగితే అవి భగవంతుడే చేసాడు కాని మీరు కాదు. అంతా ఈశ్వరుడే. ఆయన అనుగ్రహం కనుక లేకపోతే మనం ఏమీ చేయలేము. యిది మీరు సదా జ్ఞాపకం పెట్టుకోవాలి. ఒకసారి కాదు, ఒక గంటకాదు, రెండు గంటలుకాదు, ఎప్పుడూ మీరు దీనిని గుర్తు పెట్టుకోవాలి. కృష్ణుడు గొప్పపనులు చేసాడు అని మీరు అనుకొంటున్నారు కాని నేను

గొప్ప పనులు చేసాను అని ఆయన అనుకోడు. ఎందుచేతనంటే అక్కడ వ్యక్తిలేడు, శరీరగతమైన నేను అక్కడలేదు. మనలో నేను ఉన్నాడు కాబట్టి కృష్ణుడు గొప్పపనులు చేసాడు అని అనుకొంటాము కాని కృష్ణుడు అలా అనుకోడు. అలా అనుకొంటే ఆయన దేవుడు కాదు. కృష్ణుడు గీత చెప్పేటప్పుడు నేను, నేను అంటాడు. ఆ నేను దేహగతమైనది కాదు, అది చైతన్యం. నువ్వు పనులు చెయ్యలేకపోతే నా నామాన్ని స్మరించుకోవాలి అంటున్నాడు పరమాత్మ. మీరు నలుగురు కూర్చొన్నప్పుడు భగవంతుడి గురించి మాట్లాడుకోండి. అది కూడా సాధనే. మీరు రోజూ కొంతమంది మా దగ్గరకు వస్తున్నారు. మేము మాటలు చెపుతున్నాము. ఆ మాటలు కూడా సాధనే. మీరు ఒంటరిగా కూర్చొన్నప్పుడు ఆటలు నీవే, పాటలు నీవే, మాటలు నీవే అన్నీ నీవే ఔనా భగవాన్ అని మీ అంతట మీరు పాటలు పాడుకొంటున్నారు అనుకోండి. అదికూడా సాధనే.

ఈశ్వరుడు చాలా క్రూరుడు అని ఒకోసారి మనకు అనిపిస్తుంది. మీరు ఎంత స్నేహంగా ఉన్నా ఒకోసారి మిమ్మల్ని విడదీసేస్తాడు. ఎందుచేతనంటే ఈశ్వరుడు అనేవాడు అడ్మినిస్ట్రేటర్. ఈశ్వరుడు అవసరమైతే శపిస్తాడు కాని నువ్వు ఎంతపొరపాటు చేసినా గురువుమాత్రం ఎన్నడూ శపించడు. గురువు అంటే దయ. గురువు అంటే ప్రేమ. గురువు అంటే అనుగ్రహం. గురువు అంటే వాకింగ్ గ్రేస్. మీరు ప్రపంచానికి దగ్గరగా ఉంటున్నారు, దేవునికి దూరంగా ఉంటున్నారు. అందరికీ ఏదోరకమైన ప్రాపంచిక గొడవే. మీరు ప్రాపంచిక బరువు ఎక్కువగా మొయ్యటం వలన దేవుడిని స్మరించలేకపోతున్నారు. మనకు ఈ ప్రపంచాన్ని మెయ్యటమే సరిపోతోంది. ఆరోజూకారోజు మనకు చావు దగ్గరకు వస్తోంది. చావు దగ్గరకు వచ్చే కొలది మనం ప్రపంచానికి దగ్గరవుతున్నాము, దేవునికి దూరమవుతున్నాము. ఏదో మోసినంత కాలం ఈ ప్రపంచాన్ని మోసారు. వల్లకాటికి వెళ్ళేవరకు ఇంకా మోస్తారా? ఇంక ఈ ప్రాపంచిక బరువును కింద పెట్టేయండి. మీకు సమాధానం దొరుకుతుంది అంటే మీరు భగవంతుడి యొక్క సమీపానికి చేరుకొంటారు, భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతారు. ఎప్పుడైతే మీ హృదయంలో నుండి ప్రపంచాన్ని గెంటేసారో

ఆచోటు ఖాళీగా ఉంచడు. భగవంతుడు వచ్చి మీ హృదయంలో ప్రవేశిస్తాడు. మీ హృదయంలో ఉన్న ప్రపంచాన్ని కిందకు దింపకపోతే దేవుడు వచ్చి ఎక్కడ కూర్చొంటాడు. ఆయనకు కూర్చోవటానికి చోటు ఏది? మీరు గదినిండా సామానులు పెట్టేసి మీరు దయచేయండి, మీరు దయచేయండి అంటే ఆ మనిషి వచ్చి కూర్చోవటానికి చోటు ఉండాలి కదా! మీ హృదయంలో ఇంతవరకూ ప్రపంచాన్ని మోస్తూ దానిని కిందకు దింపకుండా నా హృదయంలోనికి రా అని భగవంతుడిని పిలిస్తే ఆయన రావటానికి అక్కడ ఖాళీ ఉండాలి కదా! నిరంతరం ప్రాపంచికగొడవలతో అది నిండి ఉంటే నేను ఎక్కడకు వస్తాను. మీ హృదయాన్ని కొంచెం ఖాళీ చెయ్యండి, వచ్చి కూర్చొంటాను అంటున్నాడు పరమాత్మ. ఎప్పుడైతే భగవంతుడికి ప్లేస్ ఇచ్చారో ఆయన మిమ్మల్ని సమాధానపరుస్తాడు.

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ**
**నిర్మమో నిరహంకారః సమ దుఃఖ సుఖః క్షమీ**
**సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢ నిశ్చయః**
**మయ్యర్పిత మనో బుద్ధిర్యో మద్భక్తస్సమే ప్రియః**

ఐశ్వర్యంలో, సాంఘికంగా మీకంటే రకరకాలుగా పెద్దవాళ్ళు ఉండవచ్చు. వారిని చూసి మీరు ద్వేషం పెట్టుకోవద్దు. నా అనుగ్రహం మీ శిరస్సు మీద కురవాలి అంటే మీరు ఎవరినీ ద్వేషించవద్దు. మీకంటే చిన్నవాళ్ళు ఉంటే వారిని ప్రేమించండి. స్థాయిలో మీకంటే పెద్ద వాళ్ళు ఉంటే వారిపట్ల ఉదాసీనంగా ఉండండి, వారిపట్ల ద్వేషం వద్దు. ద్వేషం వలన మీకు ఏమీ కలిసిరాదు, ద్వేషం వలన మీ మనస్సు పాడైపోతుంది. మీకు ఎవరిపట్ల ద్వేషం వద్దు, అందరిపట్ల మైత్రి కలిగి ఉండండి. సమాజంలో మంచివారు ఉంటారు, చెడ్డవారు ఉంటారు, వారిని భగవంతుడు చూసుకొంటాడు, ఆ గొడవ మనకు వద్దు. మీ సాధనకోసం, ఆధ్యాత్మిక పురోగతికోసం మీరు మాత్రం ఎవరితోను విరోధం లేకుండా అందరిపట్ల మైత్రి కలిగి ఉండండి. మీకు ఎవరిపట్ల విరోధం అక్కరలేదు, వారితో సహవాసం చేస్తే మనం పాడైపోతాము అనుకొంటే ఉదాసీనంగా ఉండండి కాని వారితో విరోధం మటుకు వద్దు.

మైత్రి అంటే ఒకటి జ్ఞాపకం వస్తోంది. ధుర్యోధనుడు దుష్టుడు, చెడ్డతనం ఆ రూపం ధరించింది వాడితో నీకు స్నేహం ఏమిటి అని కృష్ణుడు కర్ణుడిని అడిగాడు. నువ్వు చెప్పినవన్నీ వాస్తవం కాదు అని నేను అనటంలేదు. నాకు అన్నం లేనప్పడు అన్నం పెట్టాడు, నాకు చాలా సహాయం చేసాడు, నాకు చాలా ఉపకారాలు చేసాడు. ఇప్పడు వాడికి కష్టకాలం వచ్చింది. వాడు చేసిన సహాయం మర్చిపోయి ఈ కష్టకాలంలో వాడిని విడిచిపెట్టి పారిపోవటం న్యాయమా గోవిందా! వాడితో ఉంటే నీకు చావు తప్పదు అంటున్నావు, చనిపోతే ఇద్దరం కలిసే చనిపోతాము కాని స్నేహాన్ని మటుకు విడిచిపెట్టలేను అన్నాడు కర్ణుడు, అదీ మైత్రి. సత్పురుషులతో సహవాసం చెయ్యమని ఇక్కడ పరమాత్మ చెపుతున్నాడు. ఇతరులు చెడ్డవాళ్ళు అని నీకు అనిపించినప్పటికీ వారిపట్ల ఉదాసీనంగా ఉండు, ద్వేషం పెట్టుకోవద్దు. ద్వేషం పెట్టుకొంటే ప్రమాదం ఏమిటి అంటే నీ మనస్సు వెళ్ళి అక్కడ వాలుతూ ఉంటుంది.

నీ భక్తిలో చాపల్యం ఉండకూడదు, స్థిరంగా ఉండాలి. గాలి లేనిచోట దీపం ఎలా స్టడీగా ఉంటుందో అలా ఈశ్వరుడి పట్ల భక్తి నీకు స్థిరంగా ఉండాలి. దేవుడు లేడని ఎవడో చెపితే ఆ మాటలు పుచ్చుకొని నీ మనస్సు చలించకూడదు, స్థిరనిర్ణయం ఉండాలి. గాలి లేకుండా బతకగలనేమోకాని రామ అనే రెండు అక్షరాలు లేకుండా, రామనామం చేయకుండా నేను జీవించలేను అన్నాడు బాపూజీ. ఈశ్వరుడు వేరు, ఆయన నామం వేరు కాదు. మీకు ఏదో పేరు ఉంది, ఆ పేరు పెట్టి పిలవగానే మీరు పలుకుతారు కదా! అలాగే భగవంతుడి నామాన్ని స్మరించుకొంటూ ఉంటే మనకు రావలసిన బెనిఫిట్ ఏదో వస్తుంది. భక్తి మార్గం అంటే శరణాగతి మార్గం ద్వారా సులభంగా ఈశ్వరుని పొందవచ్చు. అక్కడ మనకు సొంత సంకల్పం అంటూ ఏమీ ఉండదు. భగవంతుడు ఏది ఇస్తే అది మనకు ప్రసాదమే. సుఖాన్ని ఇస్తే ప్రసాదం, కష్టాన్ని ఇస్తే ప్రసాదం, అంతా ఆయన అనుగ్రహమే. తుకారామ్ జీవితంలో అన్నీ కష్టాలే. మన శత్రువుకు కూడా అన్ని కష్టాలు ఉండకూడదు అని మనం అనుకొంటాము. తుకారామ్ అన్ని కష్టాలు అనుభవించాడు. తుకారామ్ భార్య ఆయనను కొట్టేది, చాలా హింసలు పెట్టేది. తల్లి కొట్టటం చూసి పిల్లలు కూడా తుకారామ్‌ను కొట్టేవారు. ఒకసారి

భార్య తుకారామ్‌ను చెరుకుగెడతో కొట్టేసింది. గెడ రెండు ముక్కలు అయిపోయింది. కత్తిపీట పెట్టి ముక్కలుగా ఎలాగు కోసుకోవాలి. ఇప్పుడు నీకో ముక్క, నాకో ముక్క అన్నాడు తుకారామ్. ఓ పాండురంగా! నీ దగ్గర ఎన్ని కష్టాలు ఉన్నాయో అన్నీ పంపేసావు. వాటిని అనుభవించాను, ఎందుకు ఇన్ని కష్టాలు పంపుతున్నావు అని నా మనస్సు ఎప్పుడూ రియాక్టు అవ్వలేదు. ఇంకా నీ దగ్గర అదనంగా ఏమైనా కష్టాలు ఉంటే అవి కూడా పంపించు, వాటిని కూడా అనుభవిస్తాను. ఇంక నీ దగ్గర పంపటానికి ఏమీ కష్టాలు లేవు అనుకో నా చేతిలో నువ్వే ఓడిపోయావు రంగా అన్నాడు. ఈ విధంగా భగవంతుడిని ఛాలెంజ్ చేసిన భక్తుడు తుకారామ్ మాత్రమే. ఆయనకు ఒక్కడికి మాత్రమే వైకుంఠం నుండి విమానం వచ్చి తీసుకొని వెళ్ళింది, వాడు తుకారామ్.

నీ మనస్సును, బుద్ధిని నాకు అర్పించు. నీ మనస్సును, బుద్ధిని నువ్వు బాగు చేసుకోలేకపోతే నాకిచ్చేయి, నేను బాగుచేసి ఇస్తాను. నువ్వు నాకు భక్తుడిగా ఉండు అని పరమాత్మ చెపుతున్నాడు. మీరు ఎవరినీ భయపెట్టవద్దు. మీరు చెప్పవలసిన సలహా ఉంటే చెప్పవచ్చు. వారు విన్నా, వినకపోయినా కాని ఏ మనిషిని భయపెట్టవద్దు. ఏ మనిషికి మీరు భయపడవద్దు, మీరు ఎవరినీ భయపెట్టకండి. లోకాన్ని చూసి మీరు భయపడవద్దు, మీరు లోకాన్ని భయపెట్టకండి. ఈ లోకం రూపంలో ఉన్నవాడు ఈశ్వరుడే. బి ఫియర్ లెస్. ఏ మార్గం మంచిది అని మీరు అనుకొంటున్నారో ఆ మార్గంలో ప్రయాణం చెయ్యండి. నీకు మంచిది అనిపిస్తే చెయ్యి. ఎవరో ఏదో అనుకొంటారని నువ్వు మానవద్దు. నువ్వు మంచి పని చెయ్యి. ఆ మంచి పనికోసం ఒకవేళ నువ్వు ప్రాణం విడిచిపెట్టినా భగవంతుని దయ నీకు కలుగుతుంది. మంచి ఆలోచన విడిచిపెట్టవద్దు. ఇది మంచిపని అనుకొని చేసేటప్పుడు నువ్వు ఎవరికీ భయపడనక్కరలేదు. మంచిచేసే ప్రయత్నంలో ఒకవేళ నిన్ను ఎవరైనా చంపేస్తే సంతోషంగా ప్రాణం ఇయ్యి. అల్లూరిసీతారామరాజుకు అంతపేరు రావటానికి కారణం ఏమిటి అంటే మనిషికి అన్నింటికంటే ప్రాణం అంటే ఇష్టం. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్‌వారు ఆయనను కాల్చి చంపినప్పుడు మనిషికి ఇష్టమైన ప్రాణాన్ని భయంలేకుండా

సంతోషంగా ఇవ్వగలిగాడు కాబట్టి ఆయన వీరుడు అయ్యాడు. ఆయన వీరత్వానికి ఈ జయంతులు అవి చేస్తున్నారు. ఇక్కడ ఒక రహస్యం ఉంది. జీవితం పొడుగునా సత్కర్మలు చేసేవాడు ఏ లోకాన్ని అయితే పొందుతాడో, ఒక మంచి పనికోసం తన ప్రాణాన్ని త్యాగంచేసినవాడు కూడా అటువంటి గొప్ప లోకాలను పొందుతాడు. ఓ జటాయువు! రావణాసురుడు బలమైన రాక్షసుడు అని తెలిసికూడా నువ్వు వాడితో వీరోచితంగా పోరాడి సీతను రక్షించటంకోసం నీ ప్రాణాన్ని విడిచిపెట్టావు. పెద్దపెద్ద తపస్సులు చేసినవారు, మహర్షులు, యోగులు, ఋషులు ఏ పుణ్యలోకాలకు వెళుతున్నారో ఓ జటాయువు నువ్వు అటువంటి పుణ్యలోకాలకు వెళ్ళు, ఇది రాముడి ఆజ్ఞ అంటాడు రామచంద్రమూర్తి. ఆయన తండ్రికి కూడా ఇవ్వని గౌరవం జటాయువుకు ఇచ్చి, ఆయనే స్వయంగా పుల్లలు పరిచి జటాయువు శరీరానికి నిప్పు పెట్టాడు. శరీరం కాలి అగ్నిజ్వాల పైకి లెగుస్తుంది. ఓ జటాయువు యు ఆర్ మై సెకండ్ ఫాదర్. దశరధుడు నాకు శరీరాన్ని మాత్రమే ఇచ్చాడు కాని నువ్వు నాకోసం ప్రాణం ఇచ్చావు అంటాడు రాముడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-07-2015 అప్పనపల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

స్వర్గం, నరకం ఈ గొడవలు అనవసరం, మనకు వాసనాక్షయం ముఖ్యం. శరీరం చనిపోయే రోజు వచ్చేటప్పటికి పూర్తిగా వాసనాక్షయం అయిపోయింది అనుకోండి ఇంకవాడు నూటికి నూరుపాళ్ళు హేపీగా ఉంటాడు, వాడికి పునర్జన్మలేదు. వాడికి ఏ వాసనలేదు అనుకోండి ఇంకవాడు శరీరాన్ని ఏమి చేసుకొంటాడు. వాసనలేనివాడికి సృష్టి ఏమిటి, వాసనలేనివాడికి ప్రపంచం ఏముంది. నువ్వు వాసనను కనుక రిపీట్ చేస్తూఉంటే అది పెరిగిపోతుంది అంటే నిప్పమీద కిరసనాయిల్ పోసినట్లు అవుతుంది. అసలు వాసన ఎందుకు వస్తుంది. మనం ఏదో కర్మ చేస్తాము, దానికి ఫలితం వస్తుంది. ఆ కర్మఫలితాన్ని ఎంజాయ్ చెయ్యటం వలన వాసన పడుతుంది, దానిని ఎంజాయ్ చెయ్యకపోతే వాసన పడదు. ఆ వాసనలో నుండి డిజైర్, డిజైర్ నుండి తలంపు, ఆ తలంపును బట్టి పని చేయటం, ఆ పని

తాలుక ఫలితాన్ని ఎంజాయ్ చెయ్యటం వలన మరల వాసన పడుతుంది. ఇది ఒక విష చక్రం. ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా ఎవడూ దీనిలో నుండి బయటకు రాలేడు. ఏదో పని చెయ్యటం, దాని తాలుక ఫలితాన్ని ఎంజాయ్ చెయ్యటం, దాని వలన వాసన పడటం, ఆ వాసననుబట్టి మరల పనిచెయ్యటం ఇలా రిపీట్ చేస్తూ ఈ జీవుడిని ఇలా ఎంతకాలం పోషిస్తారు? నీలో ఒక్క డిజైర్ ఉన్నా కూడా నీకు పునర్జన్మ వచ్చేస్తుంది. ఎందుచేతనంటే నీకు వచ్చే డిజైర్‌ను శరీరం లేకుండా ఎంజాయ్ చెయ్యలేవు.

మనం ఎక్కువగా మనస్సు, మనస్సు అంటాము. అసలు మనస్సు అంటేనే డిస్ట్రబెన్స్. భగవాన్ ప్రశ్న ఏమిటి అంటే హు యామ్ ఐ, రామకృష్ణుడిది దేరీజ్ నో ఐ. అసలు నేను ఉంటే నేను ఎవడను అనే ప్రశ్న వేసుకోవచ్చు. దేరీజ్ నో ఐ అంటాడు. ఇప్పుడు అందరూ పుష్కర స్నానాలు చేస్తున్నారు కదా! పండితులు ఏమని చెపుతున్నారు అంటే పుష్కరస్నానం వలన పూర్వజన్మ దోషాలు, ఈ జన్మదోషాలు అన్నీ కూడా పోతాయి అంటున్నారు. దీనికి రామకృష్ణపరమహంస బాగా చెప్పాడు. గోదావరి, కృష్ణ ఈ నదుల పొడుగునా చెట్లు ఉంటాయి కదా! స్నానానికి మీరు నదిలో దిగే ముందు మీ దోషాలు అన్నీ చెట్లు మీదకు పోతాయి. మీరు స్నానం చేసి మరల బయటకు వచ్చేస్తారుకదా, అప్పుడు మీ దోషాలు అన్నీ మొత్తం వడ్డీతో సహా మీవి మీకు వచ్చేస్తాయి అని చెప్పాడు.

భగవాన్ చిన్నప్పుడు మధురైలో వాళ్ళ చిన్నాన్నగారి ఇంటిదగ్గర కొంతకాలం ఉన్నారు. ఆ పక్కఇంటివాళ్ళకు నుయ్యి ఉంది. ఆ నూతిలో నుండి రెండు బిందెల నీళ్ళు తెమ్మని పినతల్లి చెప్పేది. ఒకసారి భగవాన్ తల్లి తోడికోడలుతో మా అబ్బాయిచేత నీళ్ళు మోయిస్తున్నావా అని అడిగింది. ఆవిడ ఏమీ మాట్లాడలేదు, భగవాన్ ఏమీ మాట్లాడలేదు. భగవాన్ తల్లి ఎప్పుడైనా వచ్చి ఒకరోజు ఉండి వెళ్ళిపోయేది. తరువాత ఎప్పుడో ఒకసారి వచ్చినప్పుడు నేను స్నానం చెయ్యాలి నీళ్ళు తెమ్మని తల్లి భగవాన్‌ను అడిగింది. భగవాన్ తల్లితో ఏమన్నారు అంటే నువ్వు చెప్పిన పనే పిన్నమ్మ చెపితే ఆవిడది తప్పు అంటున్నావు. ఇప్పుడు నువ్వు చేస్తున్నది ఏమిటి? ఇటువంటి గుణాలు అన్నీ సరిచేసుకోవాలి అని చెప్పారు. ఇలా ఖండించే బుద్ధి భగవాన్‌కు

రియలైజేషన్ రాకముందు నుంచీ ఉంది. బయట చీకటిని సూర్యుడు పోగొడతాడు. లోపలి చీకటిని పోగొట్టేవాడు గురువు మాత్రమే. భగవంతుడికి ఒకరూపం లేదు, ఒక నామం లేదు. నీకు భగవంతుడి మీద భక్తి కుదిరినప్పుడు ఆయనే ఒక దేహం ధరించి గురురూపంలో వస్తాడు. ఈశ్వరుడు అన్నా, గురువు అన్నా, చైతన్యం అన్నా ఒక్కటే. మీ అందరి హృదయాలలో ఉన్న అంతర్యామిని నేను మిస్ అయిపోతున్నాను అనుకో ఇంక నాకు ఈ నామ రూపాలే కనిపిస్తాయి. బాహ్యంగా చూస్తే మన రూపాలు వేరు, గుణాలు వేరు, కులాలు వేరు, జాతులు వేరు ఇలా రకరకాలుగా ఉన్నప్పటికీ మనందరము హృదయంలో ఒకటిగానే ఉన్నాము. ఇప్పుడు నేను నిన్ను ఎలా చూస్తున్నానో అలా పులిని చూడగలమా! భయంవేసి పారిపోతాము ఎందుచేతనంటే అక్కడ అంతర్యామిని మనం చూడలేక పోతున్నాము. ఎప్పుడైతే అంతర్యామిని చూడలేకపోతున్నామో పులిని చూస్తే మనకు భయం వేస్తుంది, మనలను చూస్తే పులికి భయం వేస్తుంది. భగవాన్ స్కందాశ్రమంలో ఉండగా, విరూపాక్ష గుహలో ఉండగా అప్పుడప్పుడూ చిరుతపులులు అలా తిరుగుతూ ఉండేవి. పులి ఎదురుపడితే అందరినీ చూసినట్లే దానిని చూసేవారు. అదీ భగవాన్ వంక చూసేది. దాని దారిన అది వెళ్ళిపోయేది. ఎందుచేతనంటే భగవాన్‌కు ఎప్పుడైతే శరీరభావన లేదో దానికి కూడా శరీరభావన పోయింది. అంతర్యామిని చూడగలిగితే దేహదృష్టి పోతుంది. దేహదృష్టిపోతే భయంకూడా పోతుంది. మనం బాహ్యంగా ఉన్న నామరూపములను చూస్తూ అంతర్యామిని చూడలేకపోతే మనం ఈశ్వరుడిని మిస్ అయిపోతాము, గురువును మిస్ అయిపోతాము. మనం ఇలా ఉన్నాము అంటే మన సాధన వల్ల, మన తెలివితేటల వలన కాదు. ఇది గురువు అనుగ్రహం.

దేహం చనిపోయేవరకు ఆ దేహానికి ఎప్పుడు ఏది జరగాలో అది జరుగుతుంది. ప్రారబ్ధం దేహానికే. అర్జునుడిని చంపటానికి ఒక అస్త్రాన్ని కర్ణుడు జాగ్రత్తపెట్టి ఉంచాడు. కర్ణుడికి అర్జునుడికి యుద్ధం జరుగుతోంది. అంటే కర్ణుడికి టైము వచ్చింది ఆ అస్త్రాన్ని విడిచిపెట్టాడు. ఆ అస్త్రం ఎవడిమీద విడిచి పెడితే వాడు చనిపోతాడు. ఇక్కడ అర్జునుడికి భగవంతుడు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అస్త్రాన్ని అర్జునుడి పీకకు గురిపెట్టాడు కర్ణుడు. అది దగ్గరకు వస్తోంది

అప్పుడు స్వామి రథాన్ని కొంచెం కిందకు తొక్కాడు. అది తలకాయ తీసేసే బదులు కిరీటాన్ని పట్టుకొనిపోయింది. అలాగే మీకు గురువు అనుగ్రహం ఉంటే ఒకవేళ చెడ్డకర్మ నీ నెత్తిమీద పడినా దానివలన పెద్ద నష్టం వచ్చేది కూడా చిన్న నష్టంతో పోతుంది. వాడు గురువు. ఈ ప్రపంచం అంతా దుఃఖమయం. ప్రపంచంలో ఎక్కడా సుఖంలేదు. మనం సుఖంకోసం బయట వెతుకుతాము. నీ హృదయంలో తప్పించి సృష్టిలో ఎక్కడా సుఖంలేదు. సుఖం అనేది, శాంతి అనేది, మన హృదయంలోనే ఉంది అనే నిశ్చయం ముందు నీకు రావాలి. అప్పుడు సుఖంకోసం, శాంతికోసం నువ్వు బయట వెతకటం మానేస్తావు.

భగవంతుడు ఉన్నాడా, లేడా అని సందేహం పెట్టుకోకుండా ఈశ్వరుడు అనేవాడు ఒక్కడు ఉన్నాడు అనేటటువంటి పూర్ణవిశ్వాసం నీకు ఉంటే నీలో ఉన్న దోషాలనుండి విడుదలచేసి, నిన్ను పవిత్రుడిగా చేసి నీకు నేను మోక్షాన్ని యిస్తాను అని పరమాత్మ చెపుతాడు. అయితే పూర్ణశరణాగతి, మినహాయింపులులేని శరణాగతి ఉండాలి. అక్కడ షరతులు ఏమీ ఉండకూడదు. నువ్వు నాకు ఈ ఉపకారం చెయ్యి, మళ్ళీ నేను వచ్చి గిరిప్రదక్షిణ చేస్తాను అని ఇటువంటి షరతులు ఉండకూడదు. మీరందరు ఉద్ధరింపబడతారు, ఇందులో సందేహం వద్దు. నీ అజ్ఞానానికి గురువు అనుగ్రహం అనే నిప్పు తగిలితే అది పూర్తిగా కాలటానికి ఒకోసారి లేటు అవ్వవచ్చు కాని ఏదో జన్మలో కాలిపోతుంది. మీరు సందేహం పెట్టుకోవద్దు. మీరు భోగాలు అనుభవించేటప్పుడు వచ్చే సుఖం, శాంతివేరు, గురువు దగ్గరనుండి పొందే శాంతివేరు. భౌతికంగా మీకు వచ్చేసుఖాలు అన్నీ దుఃఖమిశ్రితం. అందులో దుఃఖం కలిసి ఉంటుంది. గురువుదగ్గరనుండి వచ్చే శాంతిలో దుఃఖం కలిసి ఉండదు. భౌతికసుఖాలు అన్నీ దుఃఖమిశ్రితం, అవి పునర్జన్మలకు కారణం అవుతాయి. శరీరం వచ్చింది అంటే అది ఏదోరోజు చనిపోతుంది. ఏరకమైన భోగకాంక్ష నీకు లేకపోతే శరీరాన్ని ఏమి చేసుకొంటావు. మనందరికి ఉండాలని ఉందా, చనిపోవాలని ఉందా. అందరికీ ఉండాలనే ఉంది. ఆ ఉండటమే దేవుడు, శరీరం చనిపోతుంది. శరీరం పోయిన తరువాతకూడా వాడు ఉంటాడు. శరీరం పోయినా మనం ఉంటాము అనే అనుభవం శరీరం ఉండగా రావాలి. నువ్వు పొందవలసింది అదే. అక్కడ

తప్పించి నీ మనస్సు డైవర్ట్ అవ్వకూడదు. మీరు ఏమాట మాట్లాడినా, ఏ పనిచేసినా, నీకు ఏ ఆలోచన వచ్చినా దానిని పొందటమే గమ్యంగా పెట్టుకో.

మీరు హిమాలయాలకు వెళ్ళి తపస్సు చేసి వచ్చారా అని నన్ను అడుగుతూ ఉంటారు. నేను హిమాలయాలకు వెళ్ళలేదు, ఎక్కడా తపస్సులు చేయలేదు. నామం కూడా చేయలేదు. నాలో ఏదైనా విశేషం ఉందని మీరు అనుకొంటే, అది నూటికి నూరుపాళ్ళు గురువు చేసిందే, నేనేమీ చేయలేదు. మేము అరుచలం వెళితే ఎక్కడికి చూడటానికి వెళ్ళము. వెళితే ఒక్కసారి రమణాశ్రమానికి వెళతాము. ఎప్పడయినా ఒక్కసారి గుడికి వెళతాము. చూసేది ఏమీ లేదు, వినేది ఏమీ లేదు. గీతలో పరమాత్మ ఒక శ్లోకం చెప్పాడు. యిది అద్భుతం. మనకు మంచి నీళ్ళు కావాలంటే నూతిదగ్గరకు వెళతాము, కుళాయిదగ్గరకు వెళతాము, చెరువు దగ్గరకు వెళతాము. చెయ్యి ఎక్కడ పెడితే అక్కడ మంచినీళ్ళు దొరికేవాడికి ఇంకా నూతుల చుట్టూ, చెరువుల చుట్టూ తిరగటం ఎందుకు. అప్పడప్పడు మీకు కోరికలు నెరవేరినప్పడు శాంతి వస్తూఉంటుంది. అది భౌతకిమైనది. కాని గురువు దగ్గరనుండి వచ్చే శాంతి అలౌకికం, అభౌతికం. దానికి లోకంతో సంబంధంలేదు.

గురువు అందరిపట్ల సమభావం కలిగి ఉంటాడు. గురువు అందరిని చూస్తూ ఉంటాడు. అందరి గుణాలు ఆయనకు తెలుస్తూ ఉంటాయి కాని ఆయన చూసేది అంతర్యామినే చూస్తాడు. మీలో ఉన్న గుణాలను ఎందుకు చూస్తాడు అంటే మిమ్మల్ని విమర్శించటానికి కాదు, అంతర్యామి అనుభవంలోనికి రాకుండా మీలో ఉన్న ఏ గుణాలు అయితే అడ్డు వస్తున్నాయో చూసి వాటిని తొలగిస్తాడు. వాడు గురువు. ఒకవేళ ఏ గుణాలు అడ్డువస్తున్నాయో మీకు తెలిసినా వాటిని మీరు తొలగించుకోలేరు, ఆయన తీసేస్తాడు, అదే గురువు అనుగ్రహం. ఏదో ఇక్కడ సరదాగా కూర్చొంటున్నాము అని మీరు అనుకొంటున్నారు. కాని ఇందులో ఉన్న ప్రమాదం మీకు తెలియదు. ఒకోసారి మిమ్మల్ని మీకు కాకుండా చేసేస్తాడు. అది మీరు ఆలోచించుకోండి. మేము ఫలానా, ఫలానా అని మీరు అనుకొంటున్నారు కదా! అలా అనుకోవటం తీసేస్తాడు. మిమ్మల్ని మీకు కాకుండా చేసేస్తాడు. ముందు జాగ్రత్తకోసం చెపుతున్నాను.

అక్టోబరు 22 జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# స్వీయ సంస్కరణ

మనము శాంతిని, ఆనందాన్ని కోరుకుంటాం కాని ఏరకంగా జీవిస్తే శాంతి, ఆనందం లభిస్తాయో ఆ ప్రయత్నం చెయ్యము. మనము కోరుకునే 'శాంతి' మన స్వరూపంగా హృదయంలో ఉంది. పరమాత్మకు మరోపేరే శాంతి. కాబట్టి పరమాత్మ కన్న నేను వేరుగా ఉన్నాను అనెడి వేరుభావన నుండి అనగా వ్యక్తిభావన నుండి విడుదల పొందాలి. కేవల బ్రహ్మమే మనదృష్టికి లోకంగాను, ఇతరులుగాను కనిపిస్తోంది. మనకు శాంతి అనుభవైకవేద్యం కావాలంటే ఇతరులలోని దోషాలను కాకుండా వారిలోని అంతర్యామినే దర్శించాలి. నీటి బుడగను మహాసముద్రంగా దర్శించే విశాలదృష్టిని అలవరచుకోవాలి. ప్రపంచాన్ని పరమాత్మగా దర్శించాలి. మనలోని దోషాలను, చెడు ఆలోచనా సరళిని సరిదిద్దుకొని మనను మనము సంస్కరించుకోవాలి. ఇతరులను మార్చే ప్రయత్నము, పరిస్థితులను మార్చే ప్రయత్నము చెయ్యకుండా మనను మనము మార్చుకొనే ప్రయత్నం చెయ్యాలి, అదే గొప్ప సంస్కరణ. ప్రపంచం అనే సమిష్టి కుటుంబంలో మనమంతా సభ్యులమే! చిన్న పని అయినా శ్రద్ధగా చేస్తూ, ఓర్పు, సహనంతో ముందుకు సాగాలి. మనస్సే సంసారం. మన మనస్సు బాధపడకుండా ఉండాలంటే ఇతరుల మనస్సును బాధపెట్టకూడదు. ఇతరులను వారి గురించిన తలంపులను మన మనస్సులో మొయ్యకూడదు. అనుకరణ పనికిరాదు. మనను మనము ఉద్ధరించుకోవడానికి సత్కర్మ నిష్కామంగా చెయ్యాలి. సహనము, సౌశీల్యము, సామరస్యము, మైత్రి, సేవాగుణము, మున్నగునవి అలవరచుకోవాలి. త్రికరణాలద్వారా అహంకారం వ్యక్తం కాకూడదు, వాటిని పరమాత్మ కేంద్రంగా ఉపయోగించుకోవాలి. అహంకారాన్ని సంతృప్తి పరచే పనులు కాక పరమాత్మకు ప్రీతి కలిగించే పనులు చెయ్యాలి. అవిద్య, అజ్ఞానం ఎక్కడో దూరంగా లేదు, దేహము-నేను అను తలంపు రూపంలో ఉంది. సాధన లేకుండా ఏది సాధ్యంకాదు కాబట్టి, ఎలా జీవిస్తే పరమాత్మను స్వరూపంగా అనుభవైకవేద్యం చేసుకోగలమో, అలా జీవించడమే ధర్మం. దేహం జీవించియుండగానే దేహాత్మబుద్ధినుండి విడుదల పొందాలి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# ఆటంకాలే బుద్ధికి పదును పెడతాయి

సామాన్య మనస్సుకు పాపం చెయ్యటం ఇష్టం. తప్పడు పనులే దానికి జీవనాధారం. హృదయం పుణ్యం చెయ్యాలని అనుకొంటుంది. ఒకోసారి పాపంచేసినవాడు సుఖపడుతున్నట్లు, పుణ్యం చేసినవాడు దుఃఖపడుతున్నట్లు మనం చూడవచ్చు కానీ అలా కనబడినందువల్ల మోసపోకూడదు. మూఢుడు ఆనందంగానే ఉన్నాను అనుకొంటాడు. ఆతని పాపాలు ఎదురు తిరిగే వరకూ పాపం పండటానికి కొంతకాలం పడుతుంది. బీజం నాటిన వెంటనే ఫలంరాదు. పాపం మొదట రుచిగా ఉంది అనిపిస్తుంది. పుణ్యం రుచి పరిణామంలో అమృతంగా మారుతుంది. సత్ప్రవర్తనలోనికి మానవుడు ప్రవేశించాక పూర్వపు పాపపు బాధలు ప్రారంభమవుతాయి. పాపం చేసిన మూఢునికి అవితప్పనిసరిగా ఎదురుతిరుగుతాయి. అది ప్రకృతి ధర్మం. అలా ఎదురు తిరగవలసిందే దాన్ని అడ్డుకోలేము. దాని నుండి పారిపోలేము. ప్రకృతికి మినహాయింపు ఉండదు. “ఏసధమ్మోసనంతనో” అన్నది మూలసూత్రం. పాప ఫలితం ప్రారంభమైన తరువాత ఈ భూమి మీదే అనుభవించాలి. ఆకాశంలో ఉన్నా, సాగరమధ్యంలో ఉన్నా, పర్వత గుహల్లో దాక్కొన్నా అది పట్టుకొంటుంది. అది మరల మరల జ్ఞాపకం చేస్తుంది. పాపమే భయం రూపంలో పీడిస్తుంది. జీవితాన్ని ఆషామాషీగా సాగిస్తే తప్పలు చేసి తీరతాము. అది అంతా ఎదిగే విధానంలో ఒక భాగమే. నేర్చుకొనే విధానంలో తప్పలు తప్పనిసరి. వివేకానంద “నా బాధలకు, కష్టాలకు నా అతి దయే కారణం” అంటారు. తప్పిపోతేనే సరియైన దారి పట్టుకొంటాము. శ్రీనాన్నగారు “భక్తులకే కష్టాలు ఎక్కువ” అంటారు. ఈ జీవితం పరమ పదాన్ని తెలుసుకోవటానికే దాన్ని పొందటానికి దుఃఖం ఉద్దేశించబడింది. పుట్టినప్పటినుంచి ఏ వెలుతురు లేక అజ్ఞానమనే చీకటిలో తడుముకొనే బ్రతుకుతున్నాము. శక్తులన్నిటినీ మనమే కూడదీసుకొని స్మృతి పూర్వకంగా జీవించటం మొదలుపెడితే ఆత్మ వెలుగు చూడగలము. అనుకూల ప్రతికూలాలు నిరంతరంగా ఒకదానికొకటి సమన్వయం పరచుకొంటూ ఉంటాయి. సోమరిగా ఉంటే విప్లవంరాదు అది పరిణామ ప్రక్రియ ద్వారానే సాధ్యం. ఆత్మలో నివశించడాన్ని ఆరంభించినవాడే మహామౌనంలో తన్నుతాను తెలుసుకొంటాడు. ఆనందం వర్షిస్తుంది. లోకానికి మనం ఏది అందిస్తామో, లోకం మనకు అది అందిస్తుంది. మనస్సు జీవించేది గతంలోనో, భవిష్యత్తులోనో అందులో ఉనికిని తేలేవు. వర్తమానంలో ఉంచాలి. అభిప్రాయాలు, ఆలోచనలు, ఆదర్శాలు ఇవి ఏమీ మనకు సాయపడవు. అవగాహన మాత్రం సాయపడుతుంది. అర్థం చేసుకోవటమే మాస్టర్ “కీ”. అనుకరణ శుద్ధ తప్ప. అది ఎప్పడూ తప్పే. స్వచ్ఛంగా ఉన్న వ్యక్తిని, సజీవంగా ఉన్న వ్యక్తిని సమాజం దూషిస్తుంది. సాంప్రదాయాల్లో అనుసరించు అని నిరసిస్తుంది. అందులో సత్యంలేదు, స్వతంత్రుడైన వ్యక్తి మొదట నిరశించినా అంతిమంగా పూజింపబడతాడు, గాంధీలా ఆరాధింపబడతాడు. నిజమైన స్వతంత్రుడు నిరసనలకు, బహిష్కరణలకు భయపడడు. ఆతని బుద్ధిని పదునుపెట్టుకొంటాడు ఎరుకతో జీవిస్తాడు ఆనందంగా.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**